
సాక్షి ఒడిశా

బుధవారం । 1 । మార్చి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,85,633లు, బంగారం 950 మిల్లీ గ్రాములు, వెండి 15 గ్రాముల 300 మిల్లీ గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



రణరంగం

- అసెంబ్లీ ముట్టడికి బీజేపీ యువమోర్చా యత్నం

- 8లో.



అడవులను పరిరక్షించుకోవాలి

- 8లో.

న్యూస్‌రీల్

రక్తదాన శిబిరం



కొరాపుట్: రక్తదానం చేస్తున్న దాతలు

కొరాపుట్: స్థానిక దమంజోడిలోని మసలాపుట్ మల్లుసాస ఉన్నత పాఠశాలలో రక్తదాన శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. దీనిలో భాగంగా సాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ వైద్య కళాశాల రక్తనిధి కేంద్రం సిబ్బంది రక్తం సేకరించారు. జూనియర్ రెడ్‌క్రాస్ సభ్యులు, ఆధ్యాపకులు రక్తదానం చేశారు. మొత్తం 60 యూనిట్ల రక్తం సేకరించినట్లు నిర్వాహకులు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రష్మీ రంజన్ సెతి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణసింగుపూర్‌లో...

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్‌లో ఉన్న బిజు కల్యాణ మండపంలో జిల్లా బిజు యువజనతాదళ్ అధ్వర్యంలో రక్తదాన శిబిరం మంగళవారం జరిగింది. మార్చి 5వ తేదీన దివంగత బిజు పట్నాయక్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన శిబిరంలో 60 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు బిజు యువ జనతాదళ్ జిల్లా అధ్యక్షుడు దేవాశీష్ ఖడంగ తెలియజేశారు. కార్యక్రమంలో సమితి చైర్మన్ అమ్రిత కద్రక, వైస్ చైర్మన్ బనమాలి కద్రక, జిల్లా పరిషత్ సభ్యుడు బరాటం వరప్రసాద్ రావు, సమితి బీజేడీ అధ్యక్షుడు సుందరరావు బాగ్, ఎం.ధర్మేంద్ర, బృందావన్ పాడి, భీమసేన్ బాగ్ తదితరులు పాల్గొన్నారు.

రైళ్ల సేవలకు అంతరాయం



ఛత్రిపుట్ వద్ద డబ్లింగ్ పనులు జరుగుతున్న దృశ్యం

కొరాపుట్: కొరాపుట్–కిరండోల్‌ల మధ్య రైల్వే సేవలకు అంతరాయం ఏర్పడింది. మంగళవారం రాత్రి నుంచి పలు రైళ్లు కొరాపుట్ వరకే నడవనున్నాయి. కొరాపుట్–జయపురంల మధ్య ఛత్రిపుట్–మాలిగుడ రైల్వేస్టేషన్ల వద్ద డబ్లింగ్ పనుల కోసం ఏర్పాట్లు జరగనున్నాయి. బుధవారం పూర్తిస్థాయిలో పనులు శరవేగంగా జరగడానికి అనుకూలంగా ఈ మార్గంలో రైళ్లు నిలిపివేశారు. అందువలన విశాఖ పట్నం–జగదల్‌పూర్, విశాఖపట్నం–కిరండోల్, కోల్‌కత–జగదల్‌పూర్, రౌర్కెలా–జగదల్‌పూర్, భువనేశ్వర్–జగదల్‌పూర్ రైళ్లు కొరాపుట్ వరకే రానున్నాయి. తిరిగి మార్చి 3వ తేదీ నుంచి సేవలు కొనసాగుతాయని రైల్వే వర్గాలు ప్రకటించాయి.

అపశ్రుతి

- పెళ్లి భోజనాలు తిని 40 మందికి అస్వస్థత
- 10 మంది పరిస్థితి ఆందోళనకరం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

రాయగడ: ఒక పెళ్లి భోజనాల్లో విషపూరిత ఆహారాన్ని తినడంతో 40 మంది అస్వస్థతకు గురయ్యారు. జిల్లాలోని గుడారి సమితి చకుండా గ్రామంలో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు పరిశీలిస్తే.. గ్రామంలో సోమవారం ఒకరి ఇంట్లో పెళ్లి భోజనాలు జరిగాయి. దీంతో భోజనాలు చేసిన గ్రామస్తుల్లో సుమారు 40 మందికి అదేరోజు రాత్రి విరేచనాలు, వాంతులయ్యాయి. దీనిపై గుడారి వైద్యులకు సమాచారం అందడంతో వెంటనే గ్రామానికి వైద్య బృందం చేరుకొని చికిత్స అందించారు. ప్రస్తుతం పాలొకాయి జగరంగ(32), సవిత జగరంగ (29), క్రసకాయి జగరంగ (39), ప్రమేద్ జగరంగ (45), సునీ జగరంగ (51), కుమారి జగరంగ (42), పవతీ జగరంగ (51), జగతాయి జగరంగ (49)ల పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వెంటనే చికిత్స నిమిత్తం గుడారి ఆస్పత్రికి తరలించారు. గుడారి మెడికల్ ఇన్‌చార్జి డాక్టర్ సౌమ్యరంజన్ త్రిపాఠి వీరికి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం వీరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆయన తెలియజేశారు. పెళ్లి భోజనాల్లో మాంసం తినడంతోనే అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది.

నేటి నుంచి +2 పరీక్షలు



పీఎంజీ ప్రాంతంలో అధ్యాపక సిబ్బంది ఆందోళన

- పక్కాగా ఏర్పాట్లు పూర్తి
- సీసీటీవీ నిఘా ఏర్పాటు
- అధ్యాపకులతో ప్రభుత్వం చర్చలు
- ఆందోళన కొనసాగిస్తూ పరీక్షా విధుల్లో పాల్గొనేందుకు అంగీకారం



భువనేశ్వర్: రాష్ట్ర ఉన్నత మాధ్యమిక విద్యా మండలి (సీహెచ్‌ఎస్‌ఈ) ఆధ్వర్యంలో ప్లస్ 2 వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమవ్వనున్నాయి. ఈ పరీక్షలు నిర్వహించే అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర పాఠశాలలు–సామూహిక విద్యా శాఖ మంత్రి సమీర్ రంజన్ దాస్ తెలియజేశారు. ఇదివరకే ప్లస్ 2 వార్షిక ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ప్రస్తుతం థియరీ పరీక్షల ప్రశ్న పత్రాలు హబ్‌లకు సురక్షితంగా తరలించారు. పరీక్షలకు సీహెచ్‌ఎస్‌ఈ పక్కాగా ఏర్పాట్లను పూర్తి చేసింది. నేటి నుంచి ప్లస్ 2 సైన్స్ పరీక్షలు, 2వ తేదీ నుంచి కామర్స్, ఆర్ట్స్ విభాగం పరీక్షలు, అలాగే వృత్తి విద్యా కోర్సు పరీక్షలు 3వ తేదీ నుంచి ప్రారంభమవుతాయి.

శాంతించిన అధ్యాపకులు

తమ సమస్యలను పరిష్కరించకుంటే పరీక్షల విధులు బహిష్కరిస్తామని అధ్యాపకులు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. దీంతో పరీక్షల నిర్వహణపై ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఆందోళనకారులను ప్రభుత్వం మంగళవారం చర్చలకు పిలిచింది. ఈ చర్చలు పాక్షికంగా జయప్రదమయ్యాయి. షరతులతో కూడిన సహకారం అందజేసేందుకు ఆందోళనకారుల వర్గం అంగీకరించింది. దీనిలో భాగంగా స్థానిక దిగువ పీఎంజీ స్క్వేర్ వద్ద ఆందోళన నిరవధికంగా కొనసాగుతుంది. అయితే విద్యార్థుల ప్రయోజనాల దృష్ట్యా ఇన్విజిలేషన్ డ్యూటీ చేపడతామని తెలియజేశారు. తమ డిమాండ్‌లు నెరవేర్చేవరకు సమ్మె కొనసాగిస్తామని ప్రకటించారు.

ఇదీ విషయం

ప్రభుత్వేతర ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలు, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు, ఎయిడెడ్ హయ్యర్ సెకండరీ పాఠశాలలకు గ్రాంట్–ఇన్–ఎయిడ్ చెల్లింపులో ఇతర అధ్యాపక సిబ్బందికి సమానంగా వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 662 కేటగిరీలకు చెందిన 4,000 మందికి పైగా కళాశాలల ఉపాధ్యాయులు సమ్మె చేస్తున్నారు. ఒడిశా గ్రాంట్–ఇన్–ఎయిడ్ ఆర్డర్, 2022 కింద రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లను అంగీకరించే వరకు పరీక్షలను బహిష్కరిస్తామని, ఇన్విజిలేషన్ విధులకు దూరంగా ఉంటామని చివరి క్షణం వరకు మొండికేశారు. అయితే ఉపాధ్యాయుల ప్రతినిధుల బృందం, అంతర్ మంత్రిత్వ కమిటీ మధ్య రాష్ట్ర సచివాలయంలోని ఆర్థిక శాఖ మంత్రి నిరంజన పూజారి కార్యాలయంలో సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశం అనంతరం అధ్యాపక వర్గం కొంచెం శాంతించింది. ఈ సందర్భంగా ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయ సంఘం కన్వీనర్ గోలక్ నాయక్ మీడియాతో మాట్లాడుతూ తమ డిమాండ్లను పరిశీలిస్తామని ఆర్థిక మంత్రి నిరంజన్ పూజారి హామీ ఇవ్వడంతో బుధవారం నుంచి ప్లస్ 2 పరీక్షల్లో పాల్గొనాలని నిర్ణయించుకున్నామన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ని దృష్టిలో ఉంచుకొని ఇన్విజిలేషన్‌కు హాజరవ్వనున్నట్లు వెల్లడించారు. అయితే సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. సమాన పనికి సమాన వేతనం, పింఛన్ తదితర డిమాండ్లపై నిర్ణయం తీసుకునేందుకు మార్చి 10, 12 తేదీల్లో అంతర్ మంత్రిత్వ కమిటీ (ఇంటర్ మినిస్టీరియల్ కమిటీ) మరోసారి సమావేశమవుతుందని పేర్కొన్నారు.

స్వాగతం చెబుతూ.. సంరక్షిస్తూ..!


- రుసికుల్యా తీరంలో ఆలివ్ రిడ్లేల సందడి
- గుడ్లు పెట్టేందుకు లక్షలాదిగా వస్తున్న తాబేళ్లు
- సంరక్షణ చర్యలు తీసుకుంటున్న అధికారులు



నదీ తీరానికి తరలి వస్తున్న తాబేళ్లు



నదీ తీరంలో గుడ్లు పెడుతున్న దృశ్యం



తీరంలో గుడ్లు పెడుతున్న తాబేలు

అంతర్జాతీయ స్థాయిలో జీవ వైవిద్యానికి పేరుగాంచిన రుసికుల్యా నది, బంగాళాఖాతం ముఖద్వారం వద్ద ప్రతిఏటా మాదిరిగానే గత ఐదు రోజులుగా తాబేళ్ల సందడి చేస్తున్నాయి. సుమారు 6లక్షలకు పైగా అరుదైన అలీవ్ రిడ్లేలు సంతానాభివృద్ధి కోసం ఒడ్డుకు చేరుకుంటున్నాయి. గోకురకుద, పనిబొందొ, పుర్ణబొందొ తీరానికి వచ్చి గుడ్లు పెడుతున్నాయి. మరో మూడు రోజుల్లో 1.5 లక్షకి పైగా తాబేళ్లు గుడ్లు పెట్టే అవకాశం ఉందని జిల్లా అటవీ అధికారి అమూల్య కుమార్ ప్రధాన్ తెలియజేస్తున్నారు. దీంతో తీరంలోని సుమారు 4.5 కిలోమీటర్ల పరిధిలో ఈకో సంస్థ ఆధ్వర్యంలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు స్వచ్ఛ భారత్ చేపట్టారు. తీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలను దూరంగా తరలించారు. తీరంలోని గుడ్లను సంరక్షించే చర్యలను అధికారులు చేపట్టారు. గుడ్లను సక్రమంగా కాపాడుతూ ఇంక్యుబేషన్ కాలం అనంతరం బయటకు వచ్చిన తాబేలు పిల్లలను సముద్రంలో విడిచిపెట్టనున్నారు.

– బరంపురం



తాబేళ్ల గుడ్ల రక్షణకు నిర్మించిన నెట్ జోన్



గుడ్లు పెట్టి తిరిగి సముద్రంలోకి వెళ్తున్న తాబేళ్లు



స్వచ్ఛ భారత్ నిర్వహిస్తున్న కళాశాల విద్యార్థులు

మోగిన ఎన్నికల నగారా



వివరాలు వెల్లడిస్తున్న ఎన్నికల కమిషనర్ ఆదిత్య ప్రసాద్

- హిందోల్, బర్‌గడ్ కౌన్సిల్స్‌కు ఎన్నికలు
- ఏప్రిల్ 3న పోలింగ్
- అమల్లోకి ఎన్నికల కోడ్

భువనేశ్వర్: ఢెంకనాల్ జిల్లా హిందోల్, బర్‌గడ్ జిల్లా అట్టబిరా నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్స్‌కు (ఎన్ఏసీ) ఎన్నికలు జరుగనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ మంగళవారం ప్రకటించింది. ఈ రెండు ఎన్ఏసీలకు ఏప్రిల్ 3వ తేదీన పోలింగ్ జరుగుతుందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదిత్య ప్రసాద్ పాఢి తెలిపారు. బార్‌గఢ్ జిల్లాలో అట్టబిరా ఎన్ఏసీ, ఢెంకనాల్ జిల్లా హిందోల్ ఎన్ఏసీ పదవీకాలం ఈ ఏడాది ఏప్రిల్ 12వ తేదీతో ముగుస్తుంది. దీంతో కొత్తవారిని ఎన్నుకోవాల్సి ఉంది.

3న నోటిఫికేషన్

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదిత్య ప్రసాద్ పాఢి మాట్లాడుతూ.. ఈనెల 3వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఈనెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు సంబంధిత ఎన్నికల అధికారి కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుందన్నారు. నామినేషన్ల పరిశీలన 17వ తేదీతో ముగుస్తుంది. 20వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. అనంతరం ఏప్రిల్ 3వ తేదీన పోలింగ్ నిర్వహించి, 5వ తేదీన ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడిస్తారు. అలాగే ఈ రెండు పట్టణ సంస్థల వైస్ చైర్‌పర్సన్స్ పదవికి ఏప్రిల్ 19వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ రెండు నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్ ప్రాంతాల్లో ఎన్నికల నియమావళి, నిబంధనలు మంగళవారం నుంచి అమల్లోకి వచ్చినట్లు ప్రధాన ఎన్నికల అధికారి ప్రకటించారు. ఏప్రిల్ 5వ తేదీ వరకు నిబంధనలు అమలులో ఉంటాయని వివరించారు. బార్‌గఢ్ జిల్లా అట్టబిరా నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్‌లో 12 వార్డుల్లో మొత్తం 13,520 మంది ఓటర్లు, డెంకనాల్ జిల్లా హిందోల్ ఎన్ఏసీ 16 వార్డుల్లో 9,877 మంది ఓటర్లు ఓటు వేయనున్నట్లు తెలిపారు.

విశ్వవిద్యాలయంగా గుర్తించాలి



విద్యాశాఖ మంత్రి రోహిత్ పూజారికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక శ్రీకృష్ణచంద్ర గజపతి స్వయం ప్రతిపత్తి కళాశాలను యూనివర్సిటీగా ప్రభుత్వం గుర్తించాలని పర్లాకిమిడి ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి రోహిత్ పూజారిని భువనేశ్వర్‌లోని ఆయన కార్యాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. 127 ఏళ్లు పూర్తి చేసుకున్న కృష్ణచంద్ర గజపతి కళాశాలను ఇంతకు ముందు యూజీసీ గ్రాంట్ గుర్తించినట్లు పేర్కొన్నారు. ఆయనతో పాటు మోహనా నియోజకవర్గం ఎమ్మెల్యే దాశరథి గోమాంగో ఉన్నారు.

గిరిపుత్రుడికి అమెరికా ఆహ్వానం

- ఆయుర్వేద వైద్యంలో రాణిస్తున్న హరిపంగి

కొరాపుట్: జిల్లాలోని సిమిలిగుడ సమితి తెంతులిగుడ గ్రామానికి చెందిన గిరిజన ఆయుర్వేద వైద్యుడు హరి పంగికి అత్యున్నత అవకాశం లభించింది. ఆయనను అంతర్జాతీయ సదస్సులో పాల్గొనాలని అమెరికా ఆహ్వానించింది. 8వ తరగతి వరకు చదివిన హరి పంగికి సమీప అటవీ ప్రాంతం మీద గట్టిపట్టు ఉంది. చెట్ల నుంచి సేకరించిన మూలికలు, ఆకులతో చేసిన వైద్యానికి అత్యంత ప్రాచుర్యం ఉంది. దేశంలోని సుమారు 16 రాష్ట్రాల నుంచి రోగులు అతని వద్దకు వైద్యం కోసం వస్తుంటారు. షుగర్, బీపీ, రుతుస్రావం, కిడ్నీ, గుండె పోటు తదితర 105 రోగాలకు ఆయుర్వేద విధానంలో మందులు అందించడంలో ఆయనది అందెవేసిన చేయి. తానే ఔషధ మొక్కలు పెంచే ఉద్యానవనం ఏర్పాటు చేసుకొని వాటి ద్వారా 450 రకాల మందులు తయారు



ఆయుర్వేద వైద్యుడు హరి పంగి

చేసి రోగులకు ఇస్తాడు. ప్రతిరోజూ ఉదయం గ్రామ దేవతకి పూజచేసి అడవికి వెళ్లి అవసరమైన వన మూలికలు సేకరిస్తాడు. ఆయన ఇదివరకు గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ ఆయుర్వేద వైద్యుల సమ్మేళనంలో పాల్గొన్నాడు. ప్రస్తుతం అమెరికాలోని వాషింగ్టన్‌లో ఆ దేశం నిర్వహించే ఇంటర్నేషనల్ విజిటర్స్ లీడర్ షిప్ ప్రోగ్రామ్‌కు ఆహ్వానం వచ్చింది. సమావేశంలో హరి తాను వన మూలికలతో కనుగొన్న మందులు, వాటి తయారీ, రోగుల పరిస్థితిపై వారికి వివరించనున్నారు. ఆయనకు ఇప్పటికే కార్యక్రమంలో పాల్గొనడానికి అమెరికా ప్రభుత్వం వీసా మంజూరు చేసింది.




వీసా, పాస్‌పోర్టు, టిక్కెట్లతో హరి పంగి

రూ.10లకే నాణ్యమైన భోజనం

- నబరంగ్‌పూర్‌లో హోటళ్ల యజమాని లెంకా ప్రకటన

కొరాపుట్: పేదలకు రూ.10లకే నాణ్యమైన భోజనం అందజేస్తామని నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో అనేక హోటళ్ల యజమాని బిభూతి భూషణ్ లెంక ప్రకటించారు. చాలామంది విద్యార్థులు, పేదలు, రోగులకు సాయం చేయాలనే ఉద్దేశంతో నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. అటువంటి వారికి రూ.10లకే అన్నం, పప్పు, వేపుడు కూర, ముద్ద కూర, సలాడ్ భోజనం ఇస్తామన్నారు. అందరికీ అందుబాటులో ఉండడానికి మెయిన్ రోడ్డులో తమ హోటల్ పూజా ఇన్ వద్ద ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. అవసరమైన పేదలు వచ్చి భోజనం తీసుకోవాలని ప్రకటించారు. ఆయన ఇది



ప్రత్యేక కౌంటర్ వద్ద యజమాని బిభూతి భూషణ్ లెంకా

వరకే చాలాకాలంగా పేదలకు అనేక సహాయ కార్యక్రమాలు అందజేస్తున్నారు. ఇటీవల శిశు దివాస్ రోజున మున్సిపాలిటీ స్వీపర్ల పిల్లలకు తన కొత్త హోటల్‌లో ఆతిథ్యం ఇచ్చాడు. పిల్లలకు వారి కోరిన ఆర్డర్లపై మాంసాహార వంటకాలు, ఐస్ క్రీమ్‌లు, మిఠాయిలు ఆరగించమన్నాడు. పిల్లలు ఉన్నంత సేపు హోటల్‌లో ఎవరినీ అనుమతించలేదు.

వీఐపీ కాలనీలో చోరీ



ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడివున్న దృశ్యం



దర్యాప్తు చేపడుతున్న పోలీసులు

రాయగడ: పట్టణంలోని కలెక్టర్ కార్యాలయానికి సమీపంలో ఉన్న వీఐపీ కాలనీలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. కాలనీలో నివసిస్తున్న సిమా వందనాని ఇంట్లో 433 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.39 వేల నగదు, వెండి నాణేలు దుండగులు దోచుకెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం రాత్రి భోజనాలు చేసిన అనంతరం సీమా వందనాని, ఆమె కొడుకు ఒక రూమ్‌లో పడుకున్నారు. అయితే మంగళవారం ఉదయం లేచే సమయానికి పక్కనే ఉన్న మరో రూమ్ కిటికీ గ్రిల్స్ విరగొట్టి ఉన్నాయి. దుండగులు వాటిని విరగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాలోని ఆభరణాలు, నగదు దోచుకెళ్లినట్లు గుర్తించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఐఐసీ కమలా కాంత బొసొంతొ కుమార్ కుహారొ దర్యాప్తును ప్రారంభించారు. సైంటిఫిక్ బృందాలు చేరుకుని దొంగలకు సంబంధించిన క్లూస్ సేకరించారు.

బాలికల విద్యతోనే దేశాభివృద్ధి



కృష్ణచంద్ర గజపతి విగ్రహాన్ని ఆవిష్కరించిన యువరాణి కల్యాణీదేవి గజపతి, పక్కన కలెక్టర్ లింగరాజ్ పండా

- ఎంపీ చంద్రశేఖర సాహూ
- ఘనంగా మహారాజా బాలికల ఉన్నత పాఠశాల శత వార్షికోత్సవాలు



మాట్లాడుతున్న ఎంపీ చంద్రశేఖర సాహు

పర్లాకిమిడి: బాలికల విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఎంపీ చంద్రశేఖర సాహూ అన్నారు. మహారాజా శ్రీకృష్ణ చంద్రగజపతి నారాయణ దేవ్ 1919లోనే బాలికల విద్యకు అత్యంత ప్రాధాన్యమిచ్చారని తెలియజేశారు. స్థానిక మహారాజా బాలికల ఉన్నత పాఠశాల శత వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో కృష్ణచంద్ర గజపతి విగ్రహాన్ని ఆయన ముని మనుమరాలు కల్యాణి దేవి గజపతి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కలెక్టర్ లింగరాజ్ పండా పాల్గొన్నారు. అనంతరం టౌన్‌హాల్‌లో జరిగిన శత వార్షిక ఉత్సవాలను ఎంపీ చంద్రశేఖర సాహు ప్రారంభించారు. గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలకు పూర్వ విద్యార్థిని కల్పనా బెహరా అధ్యక్షత వహించగా, మహిళా కళాశాల అధ్యాపకులు, కార్యదర్శి డా.భారతీ పాణిగ్రాహి మాట్లాడారు. మహారాజా బాలికల ఉన్నత పాఠశాలలో చదివి ప్రస్తుతం రాయగడ జిల్లా డీఐఈటీ (టీచర్స్ ట్రైనింగ్)కి ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న శైల బాల పండా మాట్లాడుతూ.. పర్లాకిమిడి గజపతి మహారాజులు బాలికా విద్యకు ఎంతగానో ప్రాధాన్యమిచ్చారన్నారు. వారి వలనే నేడు అనేకమంది విద్యార్థినులు ఉన్నత స్థానాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం పలువురిని సన్మానించారు. తదుపరి నిర్వహించిన బాలికల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

క్లుప్తంగా

పోలీసుస్టేషన్ సందర్శన



పోలీసుస్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఐజీ రాజేష్ పండిట్

కొరాపుట్: పట్టణ పోలీసుస్టేషన్‌ను సదరన్ వెస్ట్రన్ రేంజ్ డీఐజీ రాజేష్ పండిట్ మంగళ వారం సందర్శించారు. స్టేషన్‌లో ఉన్న రికార్డులు, సీజ్ చేసిన వాహనాలు, వస్తువులు పరిశీలించారు. సిబ్బంది సంఖ్య, స్టేషన్‌లో సమస్యలు, వసతులు తెలుసుకున్నారు. నేరాల సంఖ్య నమోదు, పరిష్కారం, రికవరీ, రిమాండ్‌ల వివరాలపై చర్చించారు. ఆయనతో పాటు జిల్లా ఎస్పీ అభినవ్ శంకర్, ఎస్‌డీపీవో మనోజ్ పూజారిలు ఉన్నారు.

'సర్వీసులను క్రమబద్ధీకరించండి'



ఆందోళన చేపడుతున్న ఆప్ నాయకులు, కార్యకర్తలు

పర్లాకిమిడి: జిల్లాలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ శక్తి ప్రభుత్వ కార్యాలయాల్లో సహాయకులుగా పదేళ్లుగా పనిచేస్తున్న బ్యాంకు మిత్ర, కృషి మిత్ర, ప్రాణిమిత్ర, ఎంబీకే, సీఆర్పీ ఉద్యోగుల జీతాలు పెంచడంతో పాటు వారిని క్రమబద్ధీకరించాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు శిశిర్‌కుమార్ భోంజ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు రాసిన వినతిని జిల్లా డిప్యూటీ కలెక్టర్ నటబర గోరోడోకు అందజేశారు. ఆందోళనలో ఆప్ నాయకులు లగోష్ దాస్‌బర్దన్, బిరంజన్ మజ్జి, పైల మురళీకృష్ణ, లోకనాథ్ భుక్తా తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో కోళ్ల మృతి

భోగాపురం: మండల కేంద్రంలోని చిన్న వీధికి చెందిన శీల శంకర్రావు ఇంట్లో ఉన్న కోళ్లపై సోమవారం రాత్రి కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో సుమారు రూ.20 వేలు విలువ చేసే 15 కోళ్లు మృత్యువాత పడ్డాయి.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒడిశా వాసి మృతి

సాలూరు: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒడిశా వ్యక్తి మృతి చెందినట్లు పట్టణ ఎస్సై పాపారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ, ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా సింగిగుడకు చెందిన దురక జగన్నాథ్(30)ను సాలూరు మండలంలోని జీగిరాం సమీపంలో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి చెందాడన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పాముకాటుతో ఉపాధి కూలీకి అస్వస్థత

బొండపల్లి: మండల కేంద్రం బొండపల్లికి చెందిన ఉపాధి కూలీ బొడ్డు గౌరమ్మ(48)కొండల బంద చెరువులో జరుగుతున్న ఉపాధి పనులకు మంగళవారం వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో పాము కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. ఈ విషయం గమనించిన తోటి కూలీలు ఆమెను బొండపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి వైద్యులు రిఫర్ చేశారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్య సిబ్బంది,కుటుంబ సభ్యులు తెలిపారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప,రావిచెట్ల వద్ద దీపారాధనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి, తరించారు.

రణరంగం

- అసెంబ్లీ ముట్టడికి బీజేపీ యువమోర్చా యత్నం
- పోలీసులతో వాగ్వాదం
- పలువురికి గాయాలు



దిగువ పీఎంజీ ప్రాంతంలో ఆందోళన చేస్తున్న బీజేపీ యువమోర్చా సభ్యులు

భువనేశ్వర్: దివంగత ఆరోగ్య శాఖ మంత్రి నవకిషోర్ దాస్ హత్యపై సీబీఐ విచారణ జరిపించాలనే డిమాండ్‌తో భారతీయ జనతా పార్టీ యువమోర్చా సభ్యులు మంగళవారం అసెంబ్లీ ముట్టడి యత్నం రణరంగంగా మారింది. ముట్టడిలో భాగంగా స్థానిక దిగువ పీఎంజీ వద్ద భారీ ర్యాలీ నిర్వహించింది. ర్యాలీని పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణతో ఈ ప్రాంతంలో కొన్ని గంటల సేపు ఉద్రిక్తంగా మారింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ రాజీనామా చేయాలని ఆందోళనకారులు చేసిన నినాదాలతో పరిసరాలు మారుమోగాయి. అసెంబ్లీ ముట్టడికి ఆందోళనకారులు దూకుడు ప్రదర్శించడంతో పోలీసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులపైకి నిరసనకారులు ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్, రాళ్లు రువ్వారు. ఆందోళనకారులను చెదరగొట్టే ప్రయత్నంలో పోలీసులు లాఠీలకు పనిచెప్పారు. ఘటనలో పలువురు పోలీసులు, బీజేపీ ఆందోళనకారులు, జర్నలిస్టులకు గాయాలయ్యాయి. పలువురు ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సభలో చర్చ జరగలేదు

నవ కిషోర్ దాస్ హత్య ఘటనపై అసెంబ్లీలో ఎటువంటి చర్చ జరగలేదని, ఎవరో రాసి సిద్ధం చేసిన కాగితాలను సీఎం చదివి సభలో వినిపించారని శాసనసభ విపక్ష నేత జయ నారాయణ మిశ్రా అన్నారు. ఈ కేసు విచారణ సీబీఐకి అప్పగించడంపై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు విముఖత ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. గోపాల్ దాస్‌ను నిందితునిగా పేర్కొని మానసిక స్థిమితం లేనివాడిగా మలచి, కేసును అణిచి వేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

క్రైం బ్రాంచ్ విఫలం

హత్య జరిగి నెల రోజులు కావస్తున్నా హత్య వెనుక గల కారణాలను గుర్తించడంలో క్రైం బ్రాంచ్ విఫలమైందని రాష్ట్ర బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు ఇరాసిస్ ఆచార్య ఆరోపించారు. క్రైమ్ బ్రాంచ్ ఇప్పటివరకు కేటాయించిన కేసులనే ఛేదించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. నవ కిషోర్ దాస్ హత్య వెనుక పాత్రధారులను గుర్తించేవరకు నిరసనను కొనసాగిస్తామని తెలియజేశారు. పోలీసులే తమను రెచ్చగొట్టి, ఉద్రిక్త పరిస్థితికి కారణమయ్యారని పేర్కొన్నారు.

పోలీసులకు గాయాలు: డీసీపీ ప్రతీక్ సింగ్

ఏసీపీ ర్యాంక్ అధికారులతో సహా 21 మంది పోలీసు సిబ్బంది ఘటనలో గాయపడినట్లు డీసీపీ ప్రతీక్ సింగ్ తెలియజేశారు. వీరందరినీ చికిత్స



క్యాపిటల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పోలీసు సిబ్బంది

కోసం స్థానిక క్యాపిటల్ ఆస్పత్రిలో చేర్చారు. రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు సునీల్ కుమార్ బన్సల్, కటక్-భువనేశ్వర్ జంట నగరాల పోలీసు కమిషనర్ సౌమేంద్ర కుమార్ ప్రియదర్శి ఆస్పత్రి సందర్శించి బాధిత పోలీసు సిబ్బందిని పరామర్శించారు. ఐదు పోలీసు వాహనాలు ధ్వంసమయ్యాయని పేర్కొన్నారు. పరిస్థితిని అదుపు చేసేందుకే పోలీసులు లాఠీచార్జి చేశారని, అయితే వెంటనే కార్యకర్తలు పోలీసులపై రాళ్లు, గుడ్లు విసిరారని పేర్కొన్నారు. అనంతరం ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



కార్యకర్తలను పరామర్శిస్తున్న శాసనసభ విపక్ష నేత జయ నారాయణ మిశ్రా



అసెంబ్లీ ముట్టడి చర్యల్లో గాయపడిన పోలీసు అధికారి

వైభవంగా ఎల్లమ్మ జాతర



వండకున్న వంటలతో భోజనాలు చేస్తున్న ప్రజలు



జోగితో జామి మైదానానికి వస్తున్న ఎల్లమ్మ తల్లి



ఎల్లమ్మ దర్శనానికి బారులుతీరిన భక్తులు



పుట్టకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

స్థానిక నీలకంఠేశ్వర్ పడియాలో మంగవారం ఎల్లమ్మ తల్లి జామి జాతర వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పట్టణ ప్రజలే కాకుండా ఆంధ్ర, బెంగాల్ రాష్ట్రం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వేలాది మంది భక్తులు తమ కుటుంబ సభ్యులతో వంటలు చేసుకొని అమ్మవారికి భోగాలు చేసి ప్రసాదాలు సేవించారు.

బరంపురం

సీసీ ఫుటేజ్ ఆధారంగా చోరీ కేసు ఛేదన



విలేకరుల సమావేశంలో వివరిస్తున్న డీఎస్పీ తదితరులు

పాలకొండ రూరల్/పాలకొండ: సరిగ్గా వారం క్రితం పాలకొండ నగరపంచాయతీ ప్రధాన మార్కెట్‌కు కూతవేటు దూరంలో ఉన్న ముదునూరివారి వీధిలో వడ్డె కమల ఇంటికి వెళ్లిన గుర్తుతెలియని వ్యక్తి ఇల్లు అద్దెకు కావాలని అడుగుతూ ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును తస్కరించిన ఘటన తీవ్ర సంచలనమైంది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకున్నారు. ఈ మేరకు ఎస్పీ ఎస్.విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు డాగ్‌స్క్వాడ్, సీసీఎస్, క్లూస్ టీమ్‌తోపాటు మరో రెండు బృందాలు ఈ కేసులో పురోగతి కోసం విస్తృతంగా దర్యాప్తు చేపట్టాయి. ఎటువంటి ఆధారాలు లభించనప్పటికీ వారం వ్యవధిలో పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు చోరీ చేసిన నాలుగు తులాల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు తెలియజేశారు.

సీసీ ఫుటేజీల సహకారంతో..

చోరీ కేసును ఛేదించేందుకు సీసీ ఫుటేజీలను విశ్లేషిస్తున్న క్రమంలో ఓ వ్యక్తి ఘటన జరిగిన ప్రాంతంలో పదేపదే తచ్చాడుతుండడాన్ని పోలీసులు గుర్తించారు. ఆ వ్యక్తి ఫుటేజీని వివిధ కూడళ్ల వద్ద సేకరించిన పోలీసులు నిందితుడిని పాలకొండ పరిధిలో ఎన్‌కే.రాజపురం ప్రాంతానికి చెందిన వ్యక్తిగా నిర్ధారించారు. ఆ వ్యక్తి స్థానికుడైనప్పటికీ చైన్నైలో పనులకు వలస వెళ్లి పండగకు స్వగ్రామం వచ్చాడని తెలుసుకున్నారు. స్థానిక యాలాం కూడలివద్ద నిందితుడిని అదుపులోకి తీసకున్న పోలీసులు తమదైన శైలిలో విచారణ చేయగా దొంగతనం చేసినట్లు అంగీకరించి సదరు గొలుసును పోలీసులకు అప్పగించాడు.

అడవులను పరిరక్షించుకోవాలి

జయపురం: ప్రాణకోటికి ఆధారంగా ఉన్న అడవులను పరిరక్షించుకోవాలని జయపురం సబ్ కలెక్టర్ బేధబర ప్రదాన్ సూచించారు. స్థానిక నక్కిడొంగర పర్వత ప్రాంతంలోని అటవీ విభాగ నర్సరీ ప్రాంగణంలో అటవీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన వనాగ్ని నియంత్రణ, నిరాకరణ సచేతన కార్యక్రమంలో మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోడు వ్యవసాయం కోసం అడవులకు తగలబెట్టడం వలన అడవులకు నష్టం ఏర్పడడమే కాకుండా, వాటినే ఆధారంగా జీవిస్తున్న అటవీ ప్రాంత గ్రామీణ ప్రజలు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అడవుల సంఖ్య తగ్గిపోతే జీవరాశుల మనుగడకే ముప్పు వాటిల్లుతుందన్నారు. అడవులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు.

అడవులను కాల్చవద్దు

అటవీ డివిజన్ అధికారి ఎస్.జయప్రకాశ్ సింగ్ మాట్లాడుతూ అడవులలో పోడు వ్యవసాయం కోసం అగ్గి పెట్టడం, కాల్చిన సిగరెట్లు, బీడీలు అడవులలో పడవేయడం చేయకూడదని, అలా చేస్తే అడవులు అగ్నికి ఆహుతయ్యే ప్రమాదముందన్నారు. అడవులను అగ్ని నుంచి రక్షించే బాధ్యతలను గ్రామీణులు, స్వయం సహాయక గ్రూపులు, పంచాయతీ ప్రజా ప్రతినిధులు, వన



మాట్లాడుతున్న ఎస్‌హెచ్‌జీ మహిళ

సురక్షా సమితుల కార్యకర్తలు చేపట్టాలని పిలుపునిచ్చారు. జయపురం డివిజన్‌లో గతేడాది 567 ప్రాంతాల్లో అడవులు అగ్ని ప్రమాదాలకు గురయ్యాయని వెల్లడించారు. అడవుల్లో మంటలు నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అయితే ప్రజల సహకారం లేనిదే అడవులను రక్షించలేమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జయపురం తహసీల్దార్ శ్రీ సాగరిక షాడంగి, జయపురం సబ్ డివిజన్ పోలీసు అధికారి హరిష్ బీసీ, వైల్డ్ లైఫ్ వార్డన్ రామప్రసాద్‌సాహు, జయపురం అటవీ రేంజర్ రంజితా నాయిక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

సైన్స్‌తోనే సమాజ ప్రగతి

- ఘనంగా సైన్స్ డే

జయపురం: సైన్స్‌తోనే సమాజ ప్రగతి సాధ్యమని వక్తలు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ప్రకాశ చంద్ర పట్నాయక్ మాట్లాడుతూ.. సర్ సీవీ రామన్ శాస్త్రవేత్తగా దేశానికి అందించిన సేవలను వివరించారు. విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోమనాథ్ సారిక, విశ్వరంజన్ గౌఢ, ప్రభాతీ పాణిగ్రహి, దుర్గప్రసాద్ పాత్రో, కె.ప్రమీళ, రశ్మిత నాహక్, సువర్ణ ఖిళో, బిణిత శతపతి, పాపిత ప్రధాన్, దేవేంద్ర పాఢీ తదితరులు పాల్గొన్నారు.

రాయగడ: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ పర్యావరణహిత ప్రయోగాలకు శ్రీకారం చుట్టాలని జయపురంలోని ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ కార్తీక్ చరణ్ లెంక అన్నారు. జాతీయ సైన్స్ డేని పురస్కరించుకొని స్థానిక అటానమస్ కళాశాల ప్రాంగణలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భావితరాలకు ఉపయోగపడేలా ఆవిష్కరణలకు పదును పెట్టాలని సూచించారు. భూ, జల సంరక్షణ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో జేకే పేపర్ మిల్ సంస్థ శాస్త్రవేత్త ఉపేంద్ర ప్రధాన్ త్రిపాఠి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీకే గంతాయిత్ తదితరులు పాల్గొన్నారు.



జయపురం: మాట్లాడుతున్న హెచ్‌ఎం ప్రకాశచంద్ర




పర్లాకిమిడి: సైన్స్ డేలో పాల్గొన్న అధికారులు

పర్లాకిమిడి: స్థానిక మహారాజా బాలుర ఉన్నత పాఠశాలలో సైన్స్ డే వేడుకలను జిల్లా సైన్సు కో-ఆర్డినేటర్ ఎ.రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గజపతి జిల్లాలో ఏడు సమితి కేంద్రాల్లో సైన్స్ కో-ఆర్డినేటర్లను నియమించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎస్.రామ్మూర్తి, సాత్విక్ పట్నాయిక్, డీఎస్ మూర్తి, సీనియర్ ఉపాధ్యాయులు వై.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.



జయపురం: సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు



రాయగడ: మాట్లాడుతున్న లెంక, వేదికపై గంతాయిత్, త్రిపాఠి తదితరులు



రాయగడ: సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

క్లుప్తంగా

హోటళ్లపై విజిలెన్స్ దాడులు



స్వాధీనం చేసుకున్న డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని పలు హోటళ్లు, దాబాలపై విజిలెన్సు ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో అధికారులు దాడులు చేశారు. శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా, అమలు అధికారి ఏ.సురేష్‌బాబు ఆదేశాల మేరకు మంగళవారం ట్రాఫిక్ జామ్, శ్రీసూర్య నాగావళి దాబా, అమరావతి హోటళ్లలో పౌరసరఫరాల అధికారులతో కలిసి విజిలెన్సు సిబ్బంది తనిఖీలు చేపట్టారు. నివాస గృహాల వంట అవసరాలకు వాడాల్సిన గ్యాస్ సిలిండర్లను అక్రమంగా వినియోగిస్తున్నందుకు 6(ఏ) కేసుల నమోదుకు సిఫార్సు చేసి సిలిండర్లను సీజ్ చేశారు. తనిఖీల్లో విజిలెన్సు ఎస్‌ఐ రామారావు, సిబ్బంది రామ్మోహన్, పురుషోత్తం, ఉమామహేష్, రమేష్, ఈశ్వర్రావు, శేషగిరి పాల్గొన్నారు.

యూత్ అథ్లెటిక్స్‌లో విశ్వామిత్ర ప్రతిభ



పతకం స్వీకరిస్తున్న విశ్వామిత్ర

మందస: మండలంలోని గిరిజన ప్రాంతమైన చీపి పంచాయతీ చొంపాపురం గ్రామానికి చెందిన సంత్రాసి విశ్వామిత్ర క్రీడల్లో ప్రతిభ కనబరిచాడు. ఏలూరులోని ఏఎస్ఆర్ క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో మూడు పతకాలు సాధించాడు. జావెలిన్‌త్రో, డిస్కస్‌త్రోలో రజత పతకాలు, హేమర్‌త్రోలో రజత పతకం కైవసం చేసుకున్నాడు. విశ్వామిత్ర హరిపురం శాతవాహన కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఇప్పటికే పలు పతకాలు సాధించిన విశ్వామిత్రను మంగళవారం ఏఓ బి.శివ, అధ్యాపకులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

కవితా సంపుటాలకు ఆహ్వానం

శ్రీకాకుళం కల్చరల్: కవితా నిలయం ఆధ్వర్యంలో శోభకృత నామ ఉగాది సాహితీ పురస్కారాలు–2023కు సంబంధించి పద్య, వచన కవితా సంపుటాల పోటీలు నిర్వహిస్తున్నట్లు కవితా నిలయం అధ్యక్షుడు మహ్మద్ రఫీ (ఈవేమన) మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020–23 మధ్య ముద్రితమైన సంపుటాలు పంపించాలని, మొదటి బహుమతిగా రూ.3వేలు, రెండో బహుమతిగా రు.2వేలు, మూడో బహుమతిగా రూ.వెయ్యి నగదు పారితోషికం అందిస్తామని పేర్కొన్నారు. 19న జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగే సభలో బహుమతి ప్రదానం ఉంటుందని తెలిపారు. మార్చి 10లోగా సంపుటాలు పంపాలని, పూర్తి వివరాలకు నంబర్లను 7893451307, 9491325714ను సంప్రదించాలని కోరారు. మహ్మద్ రఫీ (ఈవేమన), శారదా అపార్టుమెంట్, ఎస్–1, లక్ష్మీనగర్, రణస్థలం – 532 407, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్ అనే చిరునామాకు సంపుటాలను పంపించాలని పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణానికి భారీ విరాళం



ఆలయ కమిటీకి విరాళం అందిస్తున్న దాతలు

కొత్తూరు: మండలంలోని గూనభద్ర ఆర్ఆర్ కాలనీలో నిర్మిస్తున్న వన మహాలక్ష్మి దేవి ఆలయ నిర్మాణానికి అదే కాలనీకి చెందిన పెదకోట సావిత్రమ్మ, తాతయ్య శివకల గోపాలం జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రూ. 4.50 లక్షల విలువైన స్థలం, రూ.35 వేలు విలువైన శిఖర కలశాలను మంగళవారం విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో దాతలు సాధుబాబు, త్రివేణి, దీపిక, శ్రీరాం, సాత్విక, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రైల్వే గేటును ఢీకొట్టిన ట్రాక్టర్

పొందూరు: ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో లైదాం రైల్వేగేటు ధ్వంసమైంది. దీంతో రైల్వే సిగ్నల్ సిబ్బంది తాత్కాలిక గేటును ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం 8.30 గంటల సమయంలో కొంచాడకు చెందిన పల్ల వాసు చిప్స్ లోడుతో రాపాక నుంచి లైదాం వైపు ట్రాక్టర్‌పై వెళుతుండగా లైదాం గేటు వద్ద సిగ్నల్ పడింది. అంతలోనే ముందుకు వచ్చిన ట్రాక్టర్ గేటును ఢీకొట్టింది. దీంతో గేటు ధ్వంసమైంది. డ్రైవర్‌పై రైల్వే అధికారులకు ఫిర్యాదు చేశారు.

కాంతిరేఖ

పేద బతుకుల్లో కాంతిరేఖలు ప్రకాశిస్తున్నాయి. పేదల కోసం ప్రభుత్వం కడుతున్న ఇళ్లకు ఇప్పుడు విద్యుత్ వెలుగుల సొబగులు వచ్చాయి. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి రామకృష్ణాపురం రెవెన్యూ పరిధి కోసంగిపురం కూడలి వద్ద నిర్మిస్తున్న జగనన్న కాలనీలో మంగళవారం రాత్రి విద్యుత్ వెలుగులు కనిపించాయి. ఇక్కడ రెండువేలకు పైగా ఇళ్లు నిర్మిస్తుండగా.. వీధివీధినా విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో విద్యుత్ వెలుగులు పొందిన తొలి జగనన్న కాలనీ ఇదే.

– కాశీబుగ్గ







అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



పంటపొలాల్లో యువకుడు హరికృష్ణ మృతదేహం

పోలాకి: మండలంలోని ఈదులవలస వద్ద పంట పొలాల్లో మబగాం గ్రామానికి చెందిన రావాడ హరికృష్ణ(22) అనే యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఎలక్ట్రికల్ లైన్ సమీపంలో మృతిచెందివుండటాన్ని బట్టి విద్యుత్‌షాక్ కారణంగా భావిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్న ఎస్‌ఐ నర్సింహమూర్తి తెలిపారు. అయితే పంటపొలాల్లో ఎలక్ట్రికల్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే యువకుడు మృతిచెందాడని బాధిత కుటుంబసభ్యులతో పాటు పరిసర గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. నరసన్నపేట ఎలక్ట్రికల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.ఇందిర సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు.

విద్యుత్ షాక్‌తో చెట్టు పైనుంచి పడి..

కొత్తూరు: చింతచెట్టు ఎక్కి కాయలు దులుపుతుండగా విద్యుత్ తీగలకు కొమ్మలు తగలడంతో షాక్‌కు గురై చెట్టు మీద నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన కొత్తూరు మండలం జోగిపాడులో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జోగిపాడుకు చెందిన లుకలాపు హరిముకుంద(47) అదే గ్రామానికి చెందిన భుక్తకు చెందిన చింత చెట్టు కాయలు కిందకు దించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. చెట్టు ఎక్కి కాయలు దులుపుతుండగా కొమ్మ తగిలి షాక్‌కు గురై చెట్టు పైనుంచి కిందపడ్డాడు. ఈ ఘటనలో హరిముకుంద అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో భార్యాపిల్లలు కన్నీరుమున్నీరుగా విలపించారు. భార్య కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మే రకు కేసు నమోదు చేసిన ఎస్‌ఐ ఎం.గోవింద ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.



లుకలాపు హరిముకుంద మృతదేహం

చికిత్స పొందుతూ వ్యక్తి..

కొత్తూరు: మండలంలోని అలికాం– బత్తిలి రోడ్డులో గూనభద్ర బ్రిడ్జి వద్ద గత నెల 27న ఆటో బోల్తా పడిన ఘటనలో గాయాలపాలైన పాతపాడు గ్రామానికి చెందిన నివిర్తి మోహనరావు(60) జెమ్స్ ఆస్పత్రిలో మంగళవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ గోవిందరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించినట్లు చెప్పారు.

టెక్కలిలో పోలీసుల కార్డన్ సెర్చ్

టెక్కలి రూరల్: మేజర్ పంచాయతీ పరిధి కంచ్రవీధిలో పోలీసులు మంగళవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. టెక్కలి ఎస్‌ఐ ఎల్.రామకృష్ణ ఆధ్వర్యంలో నందిగాం, సంతబొమ్మాళి ఎస్‌ఐలు మహమద్ అమీర్ ఆలీ, మధుసూదనరావుతో పాటు సుమారు 30మంది పోలీసులు ఉదయం 5 నుంచి 7 గంటల వరకు కార్డన్ సెర్చ్ చేశారు. గుట్కా, మద్యం వంటి నిషేధిత ఉత్పత్తులు ఉన్నాయో లేదో పరిశీలించారు. అనంతరం వీధుల్లో పార్క్ చేసి ఉంచిన 42 ద్విచక్ర వాహనాల రికార్డులు పరిశీలించారు. వీధుల్లో ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు తిరిగితే తమకు సమాచారం అందించాలని కోరారు.



కార్డన్ సెర్చ్‌లో పోలీసులు

అయ్యప్ప ఆలయ మెట్ల నిర్మాణానికి ఏకశిల

సారవకోట: మండలంలోని కోదడ్డపనస గ్రామంలో గల స్వయం భూ అయ్యప్ప స్వామి ఆలయ 18 మెట్లు నిర్మాణానికి చిలకలూరి పేట నుంచి ఏక శిలను మంగళవారం తెప్పించారు. రూ.4 లక్షల విలువల గల 22 అడుగుల పొడవు గల ఈ ఏకశిలతో అయ్యప్ప స్వామి 18 మెట్లు తయారు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భారీ లారీ పై తెచ్చిన ఈ ఏక శిలను ప్రత్యేకంగా అలంకరించి శోభాయాత్రగా భక్తులు తీసుకొచ్చారు.



18 మెట్ల నిర్మాణానికి తీసుకొచ్చిన ఏక శిల

5న కూర్మ గ్రామంలో శ్రవణ కీర్తన మహోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీముఖలింగం సమీపంలోని కూర్మ గ్రామ వర్ణాశ్రమంలో ఈ 5న శ్రవణ, కీర్తన మహోత్సవం జరుగుతుందని నిర్వాహకులు నటేశ్వర నరోత్తమదాస్, త్రిబంగానంద దాస్‌లు ఓ ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ కృష్ణ చైతన్య ప్రచారకులు వికాస స్వామి ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. 5వ తేదీన ఉదయం 9 గంటలకు భజనలు, 11 గంటలకు వికాస స్వామి ప్రవచనం, 12గంటలకు శ్రీమద్ భాగవతం, శ్రీచైతన్యామృతం వంటి దివ్య గ్రంథాల వితరణ, మధ్యాహ్నం 1 గంటకు మహాహారతి, 1.30 గంటల నుంచి కార్యక్రమానికి హాజరైన జనులకు సంపూర్ణ ప్రసాద విందు ఉంటుందని, జనులందరూ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో సిక్కోలు జోరు



విజేతలతో అధికారులు, ఉపాధ్యాయులు

శ్రీకాకుళం న్యూకాలనీ/పొందూరు: రాష్ట్రస్థాయి పోటీల్లో సిక్కోలు విద్యార్థులు సత్తాచాటారు. విజయవాడలోని ఆంధ్రా లయోలా కాలేజ్ వేదికగా గత నెల 27, 28 తేదీల్లో ఏపీ రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్, క్విజ్ పోటీలు జరిగాయి. కమిషనరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఏపీ, ఎస్‌సీఈఆర్టీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన క్విజ్ పోరులో ఏపీ మోడల్ స్కూల్ పొందూరుకు చెందిన ఎల్.వెంకటేష్ (9వ తరగతి), వి.పవన్ వాసుదేవరావు (9వ తరగతి), జెడ్పీహెచ్ స్కూల్ పురుషోత్తపురం (సరుబుజ్జిలి మండలం)కు చెందిన పి.మౌనిక (9వ తరగతి)కు చెందిన ముగ్గురు విద్యార్థుల బృందం ప్రథమస్థానంలో నిలిచి పతకాలు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలో జిల్లా నుంచి 10 ప్రాజెక్టులు ప్రాతినిధ్యం వహించగా అందరూ నిరాశపరిచారు. క్విజ్ పోటీల విజేతలను డీఈఓ గార పగడాలమ్మ, డిప్యూటీ ఈఓ డాక్టర్ ఎస్.తిరుమలచైతన్య, జిల్లా సైన్స్ అధికారి ఎన్.కుమారస్వామి, ఏపీఎంఎస్ పొందూరు ప్రిన్సిపాల్ హెచ్.ప్రభాకర్, గైడ్‌టీచర్ బీవీ సత్యనారాయణ, ఆర్.వినాయకరావు, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

భార్యే చంపించింది

- భర్త హత్య కేసులో భార్యే సూత్రధారి
- ప్రియుడికి సహకరించిన మరో ఇద్దరు
- నలుగురినీ రిమాండ్‌కు తరలించిన పోలీసులు

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం పంచాయతీ వరిసాం గ్రామ సమీపంలోని లే–అవుట్‌లో జీరు బాలకృష్ణ(35)ను భార్య సునీత పథకం ప్రకారం హత్య చేయించిందని శ్రీకాకుళం డీఎస్పీ మత్తే మహేంద్ర మంగళవారం తెలిపారు. జె.ఆర్.పురం పోలీస్ స్టేషన్‌లో సీఐ ఎస్.ఆదాం, ఎస్సై జి.రాజేష్ సమక్షంలో నలుగురు నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు.

హత్య చేశారిలా..

సునీతకు రెండేళ్లుగా కంబాల వెంకటరమణ అనే యువకుడితో వివాహేతర సంబంధం ఉంది. భర్త బాలకృష్ణ నిత్యం వేధిస్తున్నాడని, వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో హత్య చేయాలని వెంకటరమణతో కలిసి పథకం వేసింది. ఇందుకు వెంకటరమణ అదే పంచాయతీకి చెందిన తన స్నేహితులు కొర్లాపు దుర్గాప్రసాద్(అఖిల్), రోకలి రాములను సహాయంగా తీసుకువెళ్లాడు. మందు పార్టీ ఉందని బాలకృష్ణను పిలిచి వరిసాం గ్రామ సమీపంలోని నూతనంగా నిర్మాణంలో ఉన్న గ్రామ సచివాలయ భవనం వద్దకు తీసుకువెళ్లారు. భార్య ఇంటి నుంచి చికెన్ కర్రీ, పార్టీకి డబ్బులు ఇచ్చి పంపించింది. బాగా మద్యం తాగిన తర్వాత బాలకృష్ణను ఆదివారం రాత్రి 10.30 గంటల సమయంలో హత్య చేశారు. బాలకృష్ణ మెడ, ఛాతిపై వెంకటరమణ బలంగా పిడిగుద్దులతో మోదగా.. మిగిలిన ఇద్దరూ కాళ్లు పట్టుకున్నారు. ప్రమాదవశాత్తు తాగి పడిపోయి, చనిపోయినట్లు ప్లాన్ చేసి లే–అవుట్‌లో మర్రిచెట్టు వద్ద పడేసి వెళ్లిపోయారు. జె.ఆర్.పురం సీఐ, ఎస్సై, సిబ్బంది రంగంలోకి దిగి చాకచక్యంగా కేసును ఛేదించారు. భార్య సునీతతో పాటు హత్య చేసిన ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వీరందరినీ రిమాండ్‌కు తరలిస్తున్నామని డీఎస్పీ తెలిపారు.



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మహేంద్ర

ఉద్దానంలో ఉద్రిక్తత

- పల్లిసారథి యువకుడిపై దాడికి నిరసనగా నిందితుడి ఇంటి ముందు ఆందోళన
- బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్





రోడ్డుపై బైఠాయించిన మహిళలు, (ఇన్‌సెట్లో) సర్ది చెబుతున్న సీఐ శంకర్‌రావు

వజ్రపుకొత్తూరు రూరల్: గత నెల 24న యువకుడిపై జరిగిన దాడి ఘటనతో మంగళవారం ఉద్దానంలో ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. ఫిబ్రవరి 24న పల్లిసారథికి చెందిన యువకుడు, ఆర్మీ ఉద్యోగి ఉప్పరపల్లి గణపతి ద్విచక్ర వాహనంపై వస్తూ చిన వంక గ్రామనికి చెందిన సాన పాపారావు ఇంటి సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన ఫోన్‌లో మాట్లాడుతుండగా తమ కారు బయటకు తీస్తాం.. అక్కడి నుంచి వెళ్లండి అని సాన క్రాంతి చెప్పడంతో ఇరువురి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో సాన పాపారావు, ఆయన కుమారులు సాన క్రాంతి, సాన సంతోష్‌లు కలిసి దాడి చేశారు. దీంతో పాటుగా పల్లిసారథి గ్రామాన్ని దూషించారంటూ బాధితులు పోలీసులను ఆశ్రయించారు. వారు ఇప్పటికే అనేక సార్లు ఇలాంటి ఘటనలకు పాల్పడ్డారని, నిందితులను దేవుడే శిక్షిస్తాడని, వారిపై ఎలాంటి కేసులు లేకుండా తమకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని బాధితునితో పాటు పల్లిసారథి గ్రామస్తులు పెద్ద ఎత్తున చినవంక వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. సాన కుటుంబీకులు అందుబాటులో లేకపోవడంతో మహిళలు రోడ్డుపై బైఠాయించడంతో సుమారు 3 గంటల పాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ రూరల్ సీఐ జి.శంకరరావుతో పాటు ఎస్సై మధుసూదనరావు, సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. పల్లిసారథి గ్రామపెద్దలతో మాట్లాడి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సర్దిచెప్పడంతో గ్రామస్తులు వెనుదిరిగారు. అనంతరం సీఐ శంకరరావు మాట్లాడుతూ ఇరువర్గాల ఫిర్యాదులను పరిశీలించి కేసు నమోదు అనుమతి కోసం కోర్టుకు పంపించామని తెలిపారు. నిందితులు అందుబాటులో లేకపోవడంతో బాధితుడు, గ్రామస్తులు కలిసి ఆందోళనకు దిగారని, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

గురుకుల పాఠశాల పరిశీలన



వసతులను విద్యార్థిని అడిగి తెలుసుకుంటున్న మాధవయ్య

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని అక్కుపల్లి మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలను బీసీ సంక్షేమ శాఖ పాఠశాల రాష్ట్ర డిప్యూటీ కార్యదర్శి పి.మాధవయ్య మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, వంట గది, తరగతి గదులను పరిశీలించారు. అలాగే రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులతో మాట్లాడి ఉత్తమ ఫలితాల సాధనకు ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. భోజన వసతులు పరిశీలించారు. పాఠశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో పని చేస్తున్న గెస్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందించారు. ఈ పర్యటనలో ఆయనతో పాటు జిల్లా కన్వీనర్ జె.లక్ష్మణరావు, పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.పాపారావు, ఉద్యోగులు ఉన్నారు.

ట్రిపుల్ ఐటీల్లో కామన్ అకడమిక్ క్యాలెండర్

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రంలోని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) క్యాంపస్‌ల్లో కామన్ అకడమిక్ క్యాలెండర్ అమలు చేయనున్నట్లు చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి చెప్పా రు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీని మంగళవారం ఆయ న సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని శ్రీకాకుళం, ఇడుపులపాయ, న్యూజివీడు, ప్రకాశం క్యాంపస్‌ల్లో ప్ర వేశాలు, పరీక్షల నిర్వహణ వంటివి కామన్ క్యాలెండర్ మేరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ట్రిపుల్ ఐటీ ప్రగతికి కృషి చేస్తున్నారని చెప్పారు. భవిష్యత్‌లో నాడు–నేడు పథకంలో భాగంగా ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లు ఆధునికీకరిస్తామన్నారు. నిర్మాణంలో ఉన్న అకడమిక్ బ్లాక్, ల్యాబ్ భవనాలు కాంట్రాక్టు గడువులోగా పూర్తిచేయాలని సూచించారు. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా భవన నిర్మాణాలు చేపడుతున్నట్లు వివరించారు. ప్రస్తుతం ప్రీ యూనివర్సిటీ కోర్సు రెండేళ్లు, ఇంజినీరింగ్ రెండేళ్లు క్లాస్‌వర్క్ జరుగుతుందని, రెండేళ్లలో పూర్తి స్థాయిలో క్లాస్‌వర్క్ నిర్వహణ లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్య అందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు, ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్‌బాబు, అకడమిక్ డీన్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి పాల్గొన్నారు.

జీఓ 1108 రద్దు అయ్యేవరకు పోరాటం



రిలే శిబిరంలో జెడ్పీటీసీ వసంతరెడ్డి, పోరాట కమిటీ నాయకులు

సంతబొమ్మాళి: కాకరాపల్లి థర్మల్ పవర్ ప్లాంట్‌కు సంబంధించిన జీఓ 1108 రద్దు అయ్యే వరకు పోరాటం ఆగదని థర్మల్ పవర్‌ప్లాంట్ వ్యతిరేక పోరాట కమిటీ ప్రతినిధులు స్పష్టం చేశారు. సంతబొమ్మాళి మండలం పోతునాయుడుపేటలో అమరవీరుల 12వ వర్ధంతి సందర్భంగా స్థూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వడ్డితాండ్ర దీక్ష శిబిరంలో సమావేశం నిర్వహించారు. అమరులైన సీరపు నాగేశ్వరరావు, బత్తిని బారికయ్య, సీరపు యర్రయ్యలకు నివాళులర్పించారు.

ఈ సందర్భంగా పోరాట కమిటీ అధ్యక్షుడు మండల గన్ను మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే జీఓ 1108 రద్దు చేయాలని, కాకరాపల్లి తంపర భూములు స్వదేశీ మత్స్యకారులకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పాల వసంతరెడ్డి, పోరాట కమిటి నాయకులు అనంతు హన్నూరావు, ఎస్.వెంకటరావు, ఎస్.రాజరావు, కేశవ పాల్గొన్నారు.

సోల్జర్.. సింగర్

- తెలుగు ఇండియన్ ఐడల్ ఎంపిక పోటీలకు మందస జవాను

మందస: దేశ సరిహద్దులో కాపలా కాసే సైనికుడు కాసేపు తుపాకీ వదిలి మైకు పట్టుకున్నాడు. గాత్రాన్ని సరిచేసుకుని పాటందుకుంటే సంగీత దర్శకుడు సైతం ఫిదా అయిపోయాడు. మందస మండలంలోని పొత్తంగి గ్రామానికి చెందిన నగిరి చ క్రపాణి 2013 నుంచి బీఎస్ఎఫ్‌లో పనిచేస్తున్నారు. చిన్నప్పటి నుంచి సంగీతం అంటే మక్కువ ఉండడంతో ఉద్యోగం చేస్తూనే పాటలు రాయడం, కీర్తనలు ఆలపించడం చేసేవారు. ఇటీవల తెలుగు ఇండియన్ ఐడల్‌కు ఎంపిక పోటీలు హైదరాబాద్‌లో జరిగాయి. ప్రాథమిక పోటీలకు చక్రపాణి అర్హత సాధించా రు. ఈ పోటీలకు ప్రముఖ మ్యూజిక్ డైరక్టర్ ఎస్ఎస్ తమన్, ప్రముఖ గాయకులు కార్తీక్, గీతా మాధురి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తున్నా రు. మార్చి 3 నుంచి ఈ ఎపిసోడ్స్ టెలికాస్ట్ కాను న్నాయి. అర్హత పోటీలో చక్రపాణి ‘ఆకాశం తాకేలా వడగాలై ఈనేలా’ అనే పాటతో జడ్జిలను ఆకట్టుకున్నారు. బీఎస్ఎఫ్ యూనిఫారంతో చక్రపాణి పాడిన ఈ పాటకు న్యాయనిర్ణేతలు వేదికపై నుంచి లేచి సెల్యూట్ చేయడం విశేషం. చక్రపాణి ‘సాక్షి’తో మాట్లాడుతూ తాను సంగీతం ఎక్కడా నేర్చుకోలేదని, వింటూనే పాటలు నేర్చుకున్నానని తెలిపారు. నాలుగు రౌండ్లలో అర్హత పోటీ సాధించానని, మిగిలిన రౌండ్లలో మార్చిలో పాల్గొంటానన్నారు. ప్ర స్తుతం ఆయన పాకిస్తాన్ బోర్డర్‌లో పని చేస్తున్నారు. ఓ వైపు దేశ సైనికునిగా పని చేస్తూనే మరో వైపు మంచి గాయకునిగా రాణిస్తున్న చక్రపాణికి పొత్తంగి సర్పంచ్ దల్లి కిరణ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దల్లి జానకిరావురెడ్డి అభినందనలు తెలిపారు.



తెలుగు ఇండియన్ ఐడల్ ఎంపిక పోటీల్లో పాడుతున్న బీఎస్ఎఫ్ జవాను నగిరి చక్రపాణి